క్లుప్తంగా

చలివేంద్రం ఏర్పాటు



ఉయ్యాలవాడలో చలివేంద్రం ప్రారంభిస్తున్న గ్రామ సర్పంచ్

ఉయ్యాలవాడ : మండల కేంద్రమైన ఉయ్యాలవాడ ప్రధాన కూడలిలో ఆదివారం గ్రామ సర్పంచ్ మేకల ఓబులేష్ చలివేంద్రాన్ని ప్రారంభించారు. రోజురోజుకు ఎండల తీవ్రత పెరుగుతుండడంతో రహదారిలో వెళ్లే బాటసారులు, వాహనదారులకు ఈ చలివేంద్రం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు బోరెడ్డి నర్సిరెడ్డి, రంగమ్మగారి కృష్ణారెడ్డి, ఆలయాల మాజీ ధర్మకర్త ఖాతా దస్తగిరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన వసంత నవరాత్రోత్సవాలు



సంజీవనగర్ రామాలయంలో ప్రత్యేక అలంకరణలో సీతారామ లక్ష్మణులు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని రామాలయాల్లో ఆదివారం వసంత నవరాత్రోత్సవాలు భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. సంజీవనగర్ రామాలయం, బైటిపేట కోదండ రామాలయం, ఎస్‌బీఐ కాలనీ రామాలయం, నూనెపల్లెలోని సీతారామాంజనేయ దేవాలయం, మూల సాగరంలోని కోదండ రామాలయాల్లో మొదటిరోజు ఉత్సవాలు, రామాయణ పఠనం నిర్వహించారు. స్వామివార్లకు ఉదయాన్నే పంచామృతాభిషేకాలు, పూలంగి సేవ, అర్చనలు, సింధూర అర్చనలు చేసి మహామంగళ హారతులు ఇచ్చారు. సాయంత్రం సంజీవనగర్ రామాలయంలో స్వామి అమ్మవార్లకు వేద పండితులు పవన్ శర్మ, కార్తికేయ శర్మల ఆధ్వర్యంలో ఊంజల్ సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భగవత్ సేవా సమాజ్ సభ్యులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం పెంపు



ఆర్.పాంపల్లెలో గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న గ్రామ సర్పంచ్

ఉయ్యాలవాడ : నిరంతరం పుస్తక పఠనం చేయడం ద్వారా విజ్ఞానం పెంపొందుతుందని గ్రామ సర్పంచ్ చాబోలు లక్ష్మీదేవి, విశ్రాంతి గ్రంథాలయాధికారి నరసింహారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని ఆర్.పాంపల్లె గ్రామంలో ప్రకృతి పీఠం ఆధ్వర్యంలో పల్లె వీరమ్మ, జమాల్‌రెడ్డి జ్ఞాపకార్థంగా నూతన గ్రంథాలయాన్ని ప్రారంభించారు. రూ. 5 లక్షలు వ్యయం చేసి భవనాన్ని సమకూర్చడంతో విశ్రాంతి గ్రంథాలయాధికారి నరసింహారెడ్డిని గ్రామ సర్పంచ్, మాజీ సర్పంచ్‌లు గోపాల్‌రెడ్డి, చిన్నవెంకటసుబ్బారెడ్డితో పాటు గ్రామ పెద్దలు ఆవుల నరసింహులు, కపురం శ్రీనివాసరెడ్డి, మద్దూరు రామకృష్ణారెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

బియ్యపు గింజపై నెలవంక



కోటేష్ వేసిన ఊహా చిత్రం

నంద్యాల(అర్బన్): రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణానికి చెందిన చిత్రకారుడు చింతలపల్లె కోటేష్ బియ్యపు గింజపై గీసిన చిత్రం అబ్బురపరుస్తోంది. నెలవంక, అల్లాను ప్రార్థిస్తున్న ముస్లిం చిత్రాన్ని మైక్రో బ్రష్‌తో గీచారు. రంజాన్ ముస్లింలకు అత్యంత పవిత్ర మాసమని, కఠోర ఉపవాసాలు ఉంటారని ఈ సందర్భంగా కోటేష్ పేర్కొన్నారు.

మద్యం పట్టివేత

శ్రీశైలం: క్షేత్ర పరిధిలోని మేకల బండ వద్ద ఉన్న పార్కింగ్ ప్లేస్‌లో తాత్కాలికంగా సెల్ చార్జింగ్ షాప్ నడుపుతున్న గుంపిని మనోజ్ కుమార్ నుంచి ఆదివారం సాయంత్రం మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు వన్‌టౌన్ సీఐ ప్రసాద్‌రావు తెలిపారు. అతని వద్ద నుంచి మ్యాగ్డోలు విస్కీ, బాటిళ్లు, కేరళ మాల్టెడ్ విస్కీ బాటిళ్లను స్వాధీనం చేసుకొని, అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఊరంతా సంబరం!

- ఘనంగా ఉగాది వేడుకలు
- భక్తులతో పోటెత్తిన ఆలయాలు

నంద్యాల(వ్యవసాయం): ప్రజలు ఉగాది పండగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. శ్రీవిశ్వావసునామ సంవత్సరం అన్ని విధాలుగా కలిసి రావాలని కోరుతూ భక్తులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. నంద్యాల పట్టణంలోని వన్‌టౌన్ ప్రాంతం, టెక్కె, నూనెపల్లె, గిరినాథ్ సెంటర్, సాయిబాబానగర్, మూల సాగరం, బొమ్మలసత్రం తదితర ప్రాంతాల్లో సంబరాలు అంబరాన్నంటాయి. బైటిపేట ఆంజనేయస్వామి దేవస్థానం, మెయిన్‌బజార్‌లోని సుంకులమ్మ దేవాలయం, టెక్కె సుంకులాపరమేశ్వరి, కోట సుంకులా పరమేశ్వరి, పప్పుల బట్టి బజారులో పెద్దమ్మ ఆలయం, బైటిపేట చౌడేశ్వరిదేవి ఆలయాల్లో అమ్మవార్లకు అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని మహానైవేద్యాలు సమర్పించారు. సంజీవనగర్ రామాలయంలో భగవత్ సేవా సమాజ్ ఆధ్వర్యంలో అధ్యక్షుడు సముద్రాల సూరయ్య, దేవరశెట్టి శ్రీనివాసులు శ్రీవెంకటేశ్వర స్వామి అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం వేదపండితుడు యాదవల్లి కార్తికేయ శర్మ పంచాంగ శ్రవణం నిర్వహించారు. ప్రథమ నంది దేవస్థానంలో అమ్మవారి ఆలయంలో బ్రాహ్మణ సేవా సమాఖ్య ఆధ్వర్యంలో విశేష పూజలు చేశారు. బ్రాహ్మణ సేవా సమాఖ్య ఆధ్వర్యంలో స్థానిక భద్రావతి భావనారుషి దేవాలయం నందు సుధీంద్రాచార్యులు పంచాగశ్రవణం, ప్రవచనం నిర్వహించారు. బసవేశ్వర స్వామి ఆలయంలో శశిభూషణ సిద్ధాంతిచే పంచాంగ శ్రవణ కార్యక్రమం నిర్వహించారు.

దొర్నిపాడు: మండలం ప్రజలు ఇళ్ల లోగిళ్లకు మామిడి తోరణాలు కట్టి తెలుగు సంవత్సరానికి ఘనంగా స్వాగతం పలికారు. ముఖ్యంగా మండలంలోని డబ్ల్యూ గోవిందిన్నె గ్రామంలో మూల పెద్దమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులంతా వందలాదిగా తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ దర్శించుకున్నారు.

గోస్పాడు: మండల పరిధిలోని గ్రామాల్లో ఉగాది సంబరాలు అంబరాన్నంటాయి. యువకులు, పెద్దలు రంగు బండ్ల ద్వారా రంగులు చల్లుకున్నారు. ఉగాది పచ్చడి చేసుకొని పండగ ప్రాముఖ్యతను చాటారు.

రుద్రవరం: మండలంలో ఉగాది వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. యువకులు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ సంబరాలు చేసుకున్నారు.



సంజీవనగర్ రామాలయంలో ఉగాది పంచాంగ పఠనం చేస్తున్న కార్తికేయ శర్మ



చాగలమర్రి మత్యన్యాకాపరమేశ్వరి ఆలయంలో పంచాంగ శ్రవణానికి హాజరైన భక్తులు

రైతులు ట్రాక్టర్లు, ఎడ్ల బండ్లకు రంగులద్ది కుటుంబ సభ్యులతో కలిసి వాటిపై కూర్చొని సుంకులమ్మ, పోలేరమ్మ, పెద్దమ్మ ఆలయాల చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఆళ్లగడ్డ వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ మాజీ చైర్మన్ గంధం రాఘవరెడ్డి, ఆర్ నాగులవరం గ్రామ సర్పంచ్ గంధం సావిత్రమ్మ కుటుంబ సభ్యులతో కలిసి మండలంలోని లింగమయ్య స్వామికి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు.

శిరివెళ్ల: మండలంలోని శిరివెళ్ల, యర్రగుంట్ల, గోవిందపల్లె, కోటపాడు, బోయలకుంట్ల, మహదేవపురం, గుంప్రమాన్‌దిన్నె, కామినేనిపల్లెలో యువకులు, పిల్లలు రంగులు చల్లుకుంటూ ఆనందంగా గడిపారు. గ్రామ దేవత మారెమ్మకు మహిళలు బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. వేడుకల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ వంశీధర్, ఎస్‌ఐ చిన్న పీరయ్య గ్రామాల్లో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

చాగలమర్రి: మండలంలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. చాగలమర్రిలోని గ్రామ దేవత చాగలమ్మ, గంగమ్మ, సత్యమ్మ, చౌడేశ్వరిదేవి ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. సాయంత్రం శ్రీమత్కన్యాకాపరమేశ్వరీ ఆలయంలో ప్రముఖ వేద పండితులు కైప వెంకట నరసింహశాస్త్రి పంచాంగ శ్రవణాన్ని వినిపించారు.



నంద్యాలలో అమ్మవార్లకు నైవేద్యాలు సమర్పిస్తున్న భక్తులు



రంగులు చల్లుకుంటున్న యువకులు



మారెమ్మకు బోనాలు సమర్పిస్తున్న మహిళలు



అలంకరణలో టెక్కె సుంకులా పరమేశ్వరి



భక్తులకు దర్శనమిస్తున్న కన్యకాపరమేశ్వరి



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



దొర్నిపాడులో అమ్మవారి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు



రుద్రవరం మండలం ఆర్.కొత్తపల్లెలో ఎడ్ల బండితో ఆలయం చుట్టూ తిరుగుతున్న దృశ్యం

వసతి గృహం తనిఖీ

నంద్యాల(న్యూటౌన్): పట్టణ సమీపంలో స్టార్ సొసైటీ ద్వారా నిర్వహించబడుతున్న నేతాజీ సుభాష్ చంద్రబోస్ అవాసియ విద్యాలయం, వసతి గృహాన్ని రాష్ట్ర సమగ్ర శిక్ష ఈడీ కో ఆర్డినేటర్ కల్పన ఆదివారం తనిఖీ చేశారు. ఉగాది పండుగ రోజున వసతి గృహంలో పిల్లలు ఉండటంపై ఆమె హర్షం వ్యక్తం చేశారు. హాస్టల్ పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆడ, మగ పిల్లలకు వేర్వేరుగా వసతులు ఏర్పాటు చేయడంతో నిర్వాహకులను అభినందించారు. సీసీ కెమెరాలు, స్టోర్‌రూంను పరిశీలించారు. అనంతరం రికార్డుల పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేసి మాట్లాడారు. ఆమె వెంట నిర్వాహకులు రాజేశ్వరమ్మ, సుబ్బరాయుడు, సీఆర్పీ హిమశేఖర్, చంద్రమ్మ, గాయత్రి, తదితరులు పాల్గొన్నారు.



వసతి గృహంలో రికార్డులను పరిశీలిస్తున్న కో ఆర్డినేటర్ కల్పన

శ్రీరంగనాథుని గ్రామోత్సవానికి రథం సిద్ధం

జూపాడుబంగ్లా: తర్తూరు లక్ష్మీరంగనాథుని బ్రహ్మోత్సవాలు ఏప్రిల్ 6 నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో స్వామివారి గ్రామోత్సవ రథాన్ని భక్తులు సిద్ధం చేశారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం రథాన్ని ఆలయం నుంచి రథశాల వద్దకు చేర్చారు. అక్కడ భక్తుల దర్శనార్థం ఉంచారు. కార్యక్రమంలో శ్రీలక్ష్మీరంగనాథస్వామివారి భక్తులు, ఆలయ ప్రధాన అర్చకుడు పాల్గొన్నారు.



స్వామివారి రథాన్ని ఆలయం నుంచి రథశాల వద్దకు తీసుకొస్తున్న భక్తులు

అలరించిన సంప్రదాయ నృత్య ప్రదర్శన



శ్రీశైలంలో నృత్యం చేస్తున్న కళాకారులు

శ్రీశైలంటెంపుల్: ఉగాది మహోత్సవాల సందర్భంగా భక్తులను అలరించేందుకు శ్రీశైల దేవస్థానం పలు ధార్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేసింది. ఆదివారం ఆలయ దక్షిణ మాఢ వీధిలోని నిత్యకళారాధన వేదికపై విశాఖపట్నంకు చెందిన ఎం.సాయిప్రియ, బృందం సంప్రదాయ నృత్య ప్రదర్శన చేపట్టారు. అలాగే ఆలయ పుష్కరిణి వద్ద మహబూబ్‌నగర్‌కు చెందిన సాయికృప కూచిపూడి కళాక్షేత్రం బృందం సంప్రదాయ నృత్యం ప్రదర్శించారు. శివదీక్షా శిబిరాల వేదికపై బెంగళూరుకు చెందిన డా.ఎం.మోహన్, బృందం వారి కన్నడ భక్తి సంగీత విభావరి, యాంఫీథియేటర్ వద్ద బళ్లారికి చెందిన బి.బసవరాజు, బృందం చేపట్టిన నృత్య ప్రదర్శన వీక్షకులను ఆకట్టుకుంది.

భూముల వేలంలో దళితులపై వివక్ష దారుణం

కొత్తపల్లి: దళితులను వేలం పాటలో పాల్గొనకుండా అడ్డుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎస్. స్వాములు, పి.ఏసన్న, సమతా సైనిక్‌దళ్ నాయకుడు సురేష్ డిమాండ్ చేశారు. ఆదివారం సింగరాజుపల్లి గ్రామంలో ఆంజనేయస్వామి ఆలయ భూముల వేలం పాట నిర్వహించారన్నారు. వేలం పాటకు వెళ్లిన దళితులు నక్క జాన్, పగిడిమాని శేఖర్‌ను వేలంపాట పాడొద్దని నిర్వాహకుడు కుమ్మరి కురుమూర్తి అభ్యంతరం వ్యక్తం చేయడం దారుణమన్నారు. వేలాన్ని రద్దు చేసి దళితులకు అవకాశం కల్పించాలని కోరారు. ఈ విషయంపై కొత్తపల్లి పోలీస్‌స్టేషన్ ముందు నిరసన వ్యక్తం చేశారు. స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నక్క ప్రసాద్, మారేడు బాలరాజు, నక్క బాలరాజు, దేవకుమార్ తదితరులు పాల్గొన్నారు.



పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన తెలుపుతున్న దళితులు

వైభవంగా కంబగిరి స్వామి ఉత్సవాలు



శ్రీలక్ష్మినరసింహ కంబగిరిస్వామికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు



సుద్దమల్లలో ఆలయం చుట్టూ వృషరాజములతో ప్రదక్షిణలు చేస్తున్న తేరుబండ్లు

ఉయ్యాలవాడ: మండలంలోని సుద్దమల్ల గ్రామంలో శ్రీ లక్ష్మీనరసింహ కంబగిరి స్వామి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఉగాది పండుగ సందర్భంగా ఇక్కడ ఏటా ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం స్వామి వారికి అభిషేకాలు, అర్చనలు, విశేష పూజలు చేశారు. మంగళవాయిద్యాలు, వేద మంత్రాల నడుమ శ్రీ లక్ష్మీనరసింహ కంబగిరి, శ్రీ లక్ష్మీదేవి అమ్మవార్ల కళ్యాణాన్ని కనుల పండువగా జరిపించారు. సాయంత్రం అల్లూరు, సుద్దమల్ల, ఉయ్యాలవాడ గ్రామస్తులు తేరుబండ్లతో ఆలయానికి చేరుకుని వృషభరాజములతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. మండల ప్రజలతో పాటు ఆళ్లగడ్డ, కోవెలకుంట్ల, జమ్మలమడుగు మండలాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. ఇదిలా ఉంటే ఉగాది పండుగను పురస్కరించుకొని ఉయ్యాలవాడలో బుడ్డా వంశీయులు బుడ్డా చంద్రమోహన్‌రెడ్డి, బుడ్డా విశ్వనాథరెడ్డి, ఎంపీపీ బుడ్డా భాగ్యమ్మ కళియుగ దానకర్ణుడు బుడ్డా వెంగళరెడ్డి జ్ఞాపకార్థకంగా పేదలకు అన్న వితరణ కార్యక్రమం చేపట్టారు.



చాగలమర్రిలోని ఈద్గా



ఈద్గా మైదానం వద్ద ఏర్పాటు చేసిన షామియానాలు

ఈద్‌కు ముస్తాబు

రంజాన్ పండుగను పురస్కరించుకుని సోమవారం ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేయనున్నారు. ఈ నేపథ్యంలో నంద్యాల, ఆళ్లగడ్డ నియోజకవర్గాల్లో ఈద్గాలను ముస్తాబు చేశారు. ప్రార్థనలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా వాటి వద్ద అవసరమైన ఏర్పాట్లు చేశారు. ఎండలు మండుతుండటంతో పలు ఈద్గాల వద్ద షామియానాలు, కార్పెట్లు, నీటి సదుపాయం తదితరవి కల్పించారు. పండుగను పురస్కరించుకుని నంద్యాల, ఆళ్లగడ్డ పట్టణాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు చర్యలు చేపట్టారు.

–చాగలమర్రి/ఉయ్యాలవాడ



ఉయ్యాలవాడలో..

పాఠశాలలో రంజాన్ వేడుకలు

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని బాలా అకాడమీ పాఠశాలలో ముందస్తు రంజాన్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. పాఠశాల కరస్పాండెంట్ రవీంద్రనాథ్, ప్రిన్సిపాల్ మాధవీలత మాట్లాడుతూ పవిత్ర గ్రంథమైన ఖురాన్ ఈ మాసంలో అవతరించిందన్నారు. నెలరోజులు ముస్లింలు భక్తిశ్రద్ధలతో ఉపవాసాలు, ధాన ధర్మాలు చేస్తుంటారన్నారు. పలువురు చిన్నారులు ముస్లిం సంప్రదాయ వస్త్రాలు ధరించి అబ్బురపరిచారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యువకులకు గాయాలు

బండి ఆత్మకూరు : యర్రగుంట్ల వద్ద ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులకు గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బండి ఆత్మకూరుకు చెందిన ముగ్గురు యువకులు ఒకే మోటార్ సైకిల్‌పై పాల కోసం యర్రగుంట్ల గ్రామానికి వెళ్లి తిరిగి వస్తుండగా ఆగివున్న జేసీబీని ఢీ కొట్టారు. ఈ ఘటనలో సద్దాం, తౌఫిక్ , సయ్యద్ గాయపడ్డారు.

సెలవు రోజుల్లోనూ బిల్లులు చెల్లించవచ్చు

ఆత్మకూరు: ఉగాది, రంజాన్ సెలవు దినాల్లోనూ విద్యుత్ బిల్లుల కేంద్రాలు పని చేస్తాయని విద్యుత్‌శాఖ ఉప కార్యనిర్వహణాధికారి బి.రామసుబ్రహ్మణ్యం తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ శ్రీశైలం నియోజకవర్గంలోని ఆత్మకూరు, పాములపాడు, కొత్తపల్లి, శ్రీశైలం, సున్నిపెంట మండలాల్లో ఈనెల 30, 31వ తేదీల్లో ఉగాది, రంజాన్ పండుగ రోజుల్లో కూడా విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రాలు తెరిచే ఉంటాయన్నారు. వినియోగదారులు సకాలంలో బిల్లులు చెల్లించి సంస్థ మనుగడకు తోడ్పాటునందించాలన్నారు.

పాస్టర్ ప్రవీణ్ మృతిపై సమగ్ర విచారణ చేయాలి



పాస్టర్ మృతికి సంతాపం తెలుపుతున్న క్రైస్తవులు



ఎంఆర్ నగర్ పెంతికోస్తు దేవుని సంఘం చర్చిలో పాస్టర్ ప్రవీణ్ మృతికి సంతాపం తెలుపుతున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): రాజమహేంద్రవరం సమీపంలో పాస్టర్ ప్రవీణ్‌కుమార్ పగడాల మృతిపై సమగ్ర విచారణ జరపాలని క్రైస్తవ మత పెద్దలు డిమాండ్ చేశారు. ఆదివారం నంద్యాల పట్టణంలోని ఎస్పీజీ పాఠశాల క్రీడా మైదానంలో సంతాప సభ నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఇటీవల కాలంలో క్రైస్తవులు, దళితులపై దాడులు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ఈ దాడులను అరికట్టడంలో విఫలమైందన్నారు. పాస్టర్ ప్రవీణ్‌కుమార్ మృతికి సర్కారే బాధ్యత వహించాలన్నారు. అనంతరం ఆత్మకు శాంతి చేకూరాలని ప్రత్యేక ప్రార్థన చేశారు. కార్యక్రమంలో హోలీక్రాస్ కెథడ్రల్ పాస్టరేట్-1 డీనరీ చైర్మన్ కొత్తమాసి జోసెఫ్, పాస్టరేట్-2 గురువులు విజయ్‌కుమార్, నంద్యాల డయాసిస్ సెక్రటరీ స్టాండ్లీ విలియం, పాల్ కిశోర్, అందం ఏసన్న, జాన్‌బెన్నీ, వైఎస్సార్‌నగర్ క్రిస్టియన్ అసెంబ్లీ నిర్వాహకులు రాజారావు, వివిధ సంఘాల పాస్టర్లు దేవప్రియం, అనిల్, అభిషేక్‌కుమార్, మన్నెం జానయ్య, తలారి ప్రసాద్, క్రిస్టఫర్ పాల్గొన్నారు.

క్రైస్తవులంతా ఐక్యతగా ఉండాలి

నంద్యాల(అర్బన్): క్రైస్తవులంతా ఐక్యంగా ఉండాలని ఎంఆర్‌నగర్ పెంతికోస్తు దేవుని సంఘం దైవజనులు రెవ డాక్టర్ జనమాల అన్నాస్ అయ్యా అన్నారు. ఆదివారం చర్చిలో నిర్వహించిన ప్రార్థనలో ఇటీవల మృతి చెందిన పాస్టర్ ప్రవీణ్‌కుమార్ పగడాలకు పెంతికోస్తు దేవుని సంఘం సంతాపం తెలుపుతూ ఆయన కుటుంబానికి ఆదరణ కలగాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా దైవజనులు అన్నాస్ అయ్యా మాట్లాడుతూ పాస్టర్లు, సువార్తికులు, విశ్వాసులపై జరిగే దాడులను ప్రభుత్వాలు అరికట్టాలన్నారు.

కన్నడ భక్తులతో మర్యాద పూర్వకంగా మెలగాలి

మహానంది: క్షేత్రానికి వచ్చే కన్నడ భక్తులతో పోలీసులు మర్యాద పూర్వకంగా మెలగాలని నంద్యాల ఏఎస్పీ మందా జావళి ఆల్ఫోన్స్ పోలీసులకు సూచించారు. ఉగాది పర్వదినం సందర్భంగా మహానందీశ్వరస్వామి దర్శనార్థం మహానందికి ఆదివారం వచ్చారు. సీఐ శ్రీనివాసులురెడ్డి, ఎస్‌ఐ రామ్మోహన్‌రెడ్డితో కలిసి ఆలయంలో చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. రాత్రి మహానంది పోలీస్‌స్టేషన్ వద్ద సీఐ శ్రీనివాసులు రెడ్డి సిబ్బందికి విధులు కేటాయించారు.

మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టం

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు మున్సిపాలిటీ చైర్‌పర్సన్ ఆసియా మారుఫ్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టే ఉద్దేశం తమ పార్టీకి గానీ, నియోజకవర్గ ఇన్‌చార్జ్ శిల్పా చక్రపాణి రెడ్డికి గానీ లేదని.. ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి చైర్‌పర్సన్‌పై ఆదరణ చూపాల్సిన అవసరం లేదని మాజీ వక్ఫ్ బోర్డ్ కమిటీ రాష్ట్ర చైర్మన్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు అహమ్మద్ హుసేన్ తెలిపారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాయకులతో కలసి ఆయన మాట్లాడారు. చైర్‌పర్సన్‌కు, కౌన్సిలర్లకు మధ్య కొంత అవగాహన లోపం ఉన్న విషయం వాస్తవమని, అది పార్టీ అంతర్గత వ్యవహారమని, దాన్ని కుటుంబ సమస్యగా సరి చేసుకుంటామని చెప్పారు. వార్డుల్లో అభివృద్ధి పనులకు చైర్‌పర్సన్ సహకరించడం లేదని కొందరు కౌన్సిలర్లు ఇబ్బంది పడుతున్న మాట వాస్తవమేనని, అయితే పార్టీ నుంచి ఎన్నికల ముందు టీడీపీలోకి పోయిన కౌన్సిలర్లే తిరిగి సొంత గూటికి చేరుకున్న సందర్భంలో మా చైర్‌పర్సన్‌ను దింపే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు. పార్టీ రాష్ట్ర పరిశీలకులు సతీష్ రెడ్డి నంద్యాలకు వచ్చినపుడు కౌన్సిలర్లు,చైర్‌పర్సన్, ఆమె తండ్రి రషీద్ పార్టీ నాయకులు ఆయన్ను కలిశారన్నారు. ఈ సందర్భంగా సతీష్ రెడ్డి, శిల్పా చక్రపాణి రెడ్డి మాట్లాడుతూ.. అవిశ్వాస తీర్మానం అవసరం లేదని, అంతా సర్దుకుపోవాలని చెప్పిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. కానీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అనవసరంగా నోరు పారేసుకుంటున్నారని మండిపడ్డారు. చైర్‌పర్సన్‌పై లేనిపోని అభిమానం చూపుతూ ఆమెకు అండగా ఉంటానని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కారణం లేకుండా శిల్పాచక్రపాణి రెడ్డిని అసభ్య పదజాలంతో దూషించడం తగదన్నారు. శిల్పా హయాంలో చేసిన అభివృద్ధి కళ్ల ముందు కనిపిస్తున్నా విమర్శలు చేయడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు సయ్యద్ మీర్,రాజమోహన్ రెడ్డి, నాయకులు బైరాపురం బాషా,రవినాయక్,తిమ్మయ్య, ధను, చాంద్ బాషా,రషీద్,అహమ్మద్ రసూల్,రబ్బానీ,దర్గమ్మ ఉన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న అహమ్మద్ హుసేన్